క్లుప్తంగా

నేడు స్టువర్టుపురంలో బజరంగ్ ఫౌండేషన్ సేవలు



సీఈఓ మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): సామాజికాభివృద్ధి, సుస్థిర ప్రగతి లక్ష్యాలుగా బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గంలోని స్టువర్టుపురంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా గ్రామంలోని పేద, బడుగు, గిరిజన వర్గాలకు చెందిన మహిళలకు నారీ రుతువు కార్యక్రమం ద్వారా శానిటరీ నాప్‌కిన్ల పంపిణీ, విద్యా విజేత కార్యక్రమం కింద గ్రామంలోని విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని వలంటీర్లకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం, రూ.5 లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేసే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించిన ఎంపీపీ



నగరం: కూలీల వలసల నివారణకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పేర్కొన్నారు. పూడివాడ గ్రామంలో ఉపాధి హామీ పనులను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పని జరిగే ప్రదేశాల్లో కూలీలకు తాగు నీరు, ప్రథమ చికిత్స కిట్లను అధికారులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. గ్రామ సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, శివయ్య పాల్గొన్నారు.

గోగులమ్మకు నైవేద్యం

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాలను యాజ్ఞీకులు ఆమంచి సృజన్ కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు దీవి రాంబాబు, దీవి గోపాల కృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారికి రూ.1.50 లక్షల వెండి పూజా సామగ్రి అందజేశారు. విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సచివాలయాల సందర్శన

రాచూరు (భట్టిప్రోలు): పల్లెకోన, రాచూరు పంచాయతీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సబ్ సెంటర్లు, సచివాలయాలను బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జె. హనుమంతరావు గురువారం సందర్శించారు. పల్లెకోన సౌత్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. వాట వాటర్ ట్యాంక్ లోపాలు సరిచేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే సబ్ సెంటర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై సమీక్షించారు. రాచూరులో జగనన్న లేఅవుట్‌ను సందర్శించి, గృహ నిర్మాణాలను పరిశీలించారు. సచివాలయ కార్యదర్శి వీవీడీవీ ప్రసాద్ బాబు, రాచూరు పంచాయతీ కార్యదర్శి వక్కలగడ్డ సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి రక్షణ స్వస్థత సువార్త సభలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు బేతేలు ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు రక్షణ స్వస్థత సువార్త సభలు జరుగుతాయని నిర్వాహకులు పాస్టర్ కె.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసంగీకులుగా రెవరెండ్ దొడ్డా జకర్యా, బిషప్ హోసన్న, బ్రదర్ డి.శ్యామ్‌కుమార్, డాక్టర్ జార్జ్ దొడ్డాలు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థిని పోకూరి నాగమహేశ్వరి సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఒంటిపూట బడి జరిగేంత వరకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఒ.రోజా రమణి, ఉపాధ్యాయిని పద్మజారాణి పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'..ప్రజా మాట కావాలి

- నేటి నుంచి ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రచారం

సూరేపల్లి(భట్టిప్రోలు): ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి గడప గడపకూ తీసుకెళ్తామని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు పేర్కొన్నారు. సూరేపల్లిలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కిట్లను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ''మా నమ్మకం నువ్వే జగన్'' అనే నినాదం తమ నుంచి వచ్చింది కాదని.. ప్రజల నుంచి వచ్చిందని పేర్కొన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సూరేపల్లి సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ మోర్ల సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు రావు చంద్రశేఖరరావు, పడమట సాయి, వాకా అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరించిన కర్లపాలెం నేతలు

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు వివరించేందుకు.. వైఎస్సార్ సీపీ ప్రవేశపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నుంచి అమలు చేయనున్న ఈ కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక పెద్దింటమ్మ ఆలయంలో గ్రామ సచివాలయాల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డితో కలసి ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడారు. గృహ సారథులు, వలంటీర్లతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, పందరబోయిన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఆట్ల నాగేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ తాండ్ర సాంబ శివరావు, సర్పంచ్‌లు దేవరకొండ అంకమ్మ, మల్లెల వెంకటేశ్వర్లు, దబ్బకూటి ఏడుకొండలు, పిట్టు నాగాంజనేయరెడ్డి, నాయకులు ఆట్ల అయ్యప్పరెడ్డి, గురపసాల వెంకటేశ్వర్లు, కాగిత ఆనంద్‌బాబు, గొర్రుముచ్చు మీరయ్య తదితరులు న్నారు.

ప్రచారానికి సర్వం సిద్ధం

కొల్లూరు: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మక చేపట్టనున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జేసీఎస్ ఇన్‌చార్జి అయిల సుబ్బారావు గురువారం తెలిపారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని 284 మంది వలంటీర్లు, 48 మంది సచివాలయ కన్వీనర్లు, 568 మంది గృహ సారథులు శుక్రవారం నుంచి తమ పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి 'జగనన్నే మా భవిష్యత్తు' అనేలా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమ నిర్వహణ కిట్లను అన్ని సచివాలయాల పరిధిలోని కన్వీనర్లకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, గరిక నీలిమ, అమిరిశెట్టి శ్రీధర్, నాయకులు కూచిపూడి మోషే, చిలకా ప్రకాశం, ఆళ్లమూడి మధు పాల్గొన్నారు.



కొల్లూరులో ప్రచార కిట్లు అందజేత..

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

బాపట్ల అర్బన్: మండలం పరిధిలోని సచివాలయాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్ తెలిపారు. చంద్రపాటి వెంకట సుబ్బయ్య కల్యాణ మండపంలో గురువారం ప్రచార కర పత్రాల ఆవిష్కరణ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కోకిల రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు మాట్లాడుతూ 20వ తేదీ వరకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మత్స్య శాఖ డైరెక్టర్ మామిడయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

భావదేవుని తొలి శాసనానికి నేటితో వెయ్యేళ్లు

- ''బాపట్ల వైభవము'' గ్రంథకర్త తిమ్మన శ్యామ్‌సుందర్

బాపట్ల: శ్రీభావనారాయణ స్వామి దేవాలయంలోని తొలి శాసనానికి నేటితో వెయ్యేళ్లు పూర్తయినట్లు ఆలయ పరిశోధకుడు, ''బాపట్ల వైభవం'' గ్రంథకర్త శ్యామ్ సుందర్ అన్నారు. 1023 సంవత్సరంలో తారణ నామ సంవత్సరం మార్చి 31వ తేదీ సోమవారం ఏకాదశి నాడు ఈ శాసనము కరికాల చోళ వంశస్థుడైన మహామండలేశ్వర పినమల్లి దేవచోడ మహారాజుచే ప్రకటించబడిందని, అధిక మాసాలను పరిగణనలోకి తీసుకుని ఈరోజుతో అనగా ఏప్రిల్ 7, 2023 నాటికి శాసన ప్రతిష్ఠ జరిగి సరిగ్గా వెయ్యేళ్లు పూర్తయినట్లు నిర్ణయించబడిందన్నారు. మొదటి రాజేంద్ర చోళుని సామంతుడైన ఈ రాజు కడప ప్రాంతం నుంచి పరిపాలించిన పొత్తపి ప్రాంత తెలుగు చోడుడని, ఆలయం ఆచంద్రార్కం అంగరంగ వైభోగ ధూపదీప నైవేద్యాలతో విలసిల్లేందుకుగాను కమ్మనాడులోని చంగల్లు గ్రామాన్ని మాన్యంగా దత్తం చేసినట్లు ఈశాసనంలో పేర్కొనబడిందన్నారు. గ్రామం ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని ఆలయ నిర్వహణకు వినియోగించాలని, దాన ప్రయోజనాన్ని కాపాడవలసిన బాధ్యతను ఆనాటి ఆలయ అధికారులైన, స్థానాపతులు, దేవకర్ములు, శ్రీవైష్ణవులకు ఇవ్వబడినట్లు ఈ శాసనంలో కట్టడి చేయబడిందన్నారు.



భావన్నారాయణస్వామి దేవాలయంపై ఉన్న తొలిశాసనం

ఆలయ పశ్చిమ ప్రాకారమందుగల ఈ శాసనం శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ వెయ్యేళ్ళ బాపట్ల ఘన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నేటికీ నిలిచి ఉందన్నారు. ఈ చంగల్లు గ్రామం పల్నాడు జిల్లాలోని నకరికల్లు మండలంలో ఉందని తెలిపారు. తీరాంధ్రలోని తొలి వైష్ణవాలయంగాను, తీరాంధ్రలో చోళులు నిర్మించిన చిట్టచివరి ఆలయంగాను, శ్రీ వైఖానస, శ్రీ వైష్ణవ సంప్రదాయాలతో విరాజిల్లుతూ చరిత్ర పుటల్లో నిలిచిన ఈ ఆలయం బాపట్ల గ్రామ ఆవిర్భావానికి అంకురార్పణ చేసిన క్షేత్రమన్నారు. బాపట్ల కేంద్రంగా బాపట్ల జిల్లా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో 1429 సంవత్సరాల చరిత్ర గల స్వయంభు శ్రీ భావనారాయణ స్వామి దేవాలయానికి రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రతిష్టాత్మకమైన ప్రాచీన ఆలయంగా స్థానం కల్పించే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

పేరలి(కర్లపాలెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎంపీపీ యారం వనజ పేర్కొన్నారు. పేరలి గ్రామ సచివాలయంలో గురువారం ఎంపీడీఓ దాసరి రాంబాబుతో కలసి ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యురాలు రమ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామస్తులకు పలు రకాల వ్యాధులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వారంలో ఒకరోజు డాక్టర్లు గ్రామానికే వచ్చి మంచంలో లేవలేని వారికి కూడా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేస్తారని తెలిపారు. సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు, పులుగు సుబ్బారెడ్డి, సీహెచ్ఓ మేరమ్మ, ఎంపీహెచ్ఈఓ కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది ఇసాక్, ప్రభావతి, జాషువా, ప్రియాంక, నాగలక్ష్మి, 104 అంబులెన్స్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వడ్డీవారిపాలెంలో వైద్య సేవలు

రేపల్లె రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వడ్డీవారిపాలెం గ్రామంలో గురువారం సర్పంచ్ వడ్డీ సునీత ప్రారంభించారు. మోళ్ళగుంట వైద్యాధికారి ప్రవల్లిక 104 వాహనం ద్వారా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.వీ రావు, సూపర్ వైజర్ ప్రేమకుమారి, పద్మావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గా, ఏఎన్ఎం ప్రవల్లిక, మేల్ హెల్త్ అసిస్టెంట్ సుభాషణ్ బాబు, మోషే పాల్గొన్నారు.

ఎస్సీల మనోభావాలు దెబ్బతినేలా కోన మాట్లాడలేదు

- దళిత సంఘాల నాయకులు

బాపట్ల: ఎస్సీల మనోభావాలు దెబ్బతినేలా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడలేదని దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఆయన మాటలకు వక్రభాష్యం చెప్తూ.. చిత్రీకరించడంపై నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోన చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు గురువారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు చింతల రాజశేఖర్ మాట్లాడారు. కోన రఘుపతి జిల్లా ఆవిర్భావ సభలో మాట్లాడుతూ.. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ ఏర్పాటులో కొంతమంది స్వార్థ ప్రయోజనాలు మెండుగా ఉన్నాయని చెప్పారన్నారు. జిల్లాకు దగ్గర ఉన్నప్పటికీ పొన్నూరు కలవకపోవటంతో ఆర్థికంగా కొంత వెనుకబడిందని చెప్పినట్లు గుర్తు చేశారు. జోగి రాజా, వడ్డి ముక్కల డేవిడ్ మాట్లాడుతూ.. దళితు అభ్యున్నతికి కోన కుటుంబం వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. జిల్లా ఏర్పాటులో పొన్నూరు నియోజకవర్గం వస్తే బాగుండేదని, అటు సంతనూతలపాడు రాకపోగా పొన్నూరు కూడా దూరంగా కావటంతో.. ఎస్సీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకే జేడీ శీలం ఈ విధంగా చేశారని మాట్లాడారే..గానీ ఎస్సీలను కించపరచలేదన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని ఎస్సీలకు పెద్ద కొడుగా ఉన్న కోనపై ఎస్సీలనే రెచ్చగొట్టేవిధంగా ఎల్లోమీడియా పన్నిన కుట్రలో భాగంగానే ఈ విధంగా చేశారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాగిత సుధీర్‌బాబు, ఇనగలూరి మాల్యాద్రి, పిల్లి శేఖర్, గేరా మణిభూషన్, గొర్రు ముచ్చు పుష్పరాజ్యం, వెంకటేశ్వర్లు, నన్నం వెంకటేశ్వర్లు, ఆడే చందు తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

బాపట్లటౌన్: పట్టణంలో అల్లర్లు సృష్టిస్తూ ఆందోళన చేసే వ్యక్తులపై గురువారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన మణికుమార్, కృష్ణచైతన్య, బొలిశెట్టి వెంకట్రావు రైల్వేస్టేషన్ రోడ్డులో అల్లర్లు సృష్టిస్తున్నారనే సమాచారం రావడంతో పట్టణ ఎస్ఐ రఫీ వారిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. అల్లర్లు సృష్టిస్తే.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వృద్ధుడి మృతి

నగరం: అద్దంకి వారిపాలెం గ్రామ సచివాలయం ఎదుట ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్ఐ రామకృష్ణ సమాచారం మేరకు.. అద్దంకివారిపాలేనికి చెందిన కేసన మస్తాన్‌రావు(78) గ్రామ సచివాలయానికి వచ్చాడు. సచివాలయం ఎదుట ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన సిబ్బంది, స్థానికులు హుటాహుటిన అతనిని లేపేందుకు ప్రయత్నించారు. అప్పటికే మస్తాన్‌రావు మృతి చెందాడు.

చోరీకి యత్నించిన మహిళల అరెస్ట్

భట్టిప్రోలు: ఫ్యాన్సీ షాపులో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను యజమాని, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం చావలి రహదారిలో ఉన్న ఓ ఫ్యాన్సీ దుకాణంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ఒక ఆటోలో వచ్చిన నలుగురు మహిళల్లో ఇద్దరు షాపులోకి వెళ్లారు. షాపు యజమాని మల్లికార్జుననను వారు మాటల్లో పెట్టగా ఆటోలో ఉన్న ఇద్దరు బయట ఉన్న సర్ఫు, క్లీనింగ్ పౌడర్లు ఇలా రూ.5విలువ చేసే వస్తువులను ఆటోలో పెట్టుకుని అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం ఆ ఇద్దరు మహిళలు కూడా అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా.. వస్తువులు లేకపోవడానికి గమనించి మల్లికార్జున స్థానికులతో కలిసి వారిని వెంబడించి పట్టుకున్నారు. ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు.

ఎంసెట్‌లో ప్రతిభకు..నగదు బహుమతి

రాచూరు(భట్టిప్రోలు): రాచూరుకు చెందిన అద్దేపల్లి స్వాతి గత ఎంసెట్‌లో 600 ర్యాంక్ సాధించడంతో.. చిల్కా కృష్ణ రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. ది గ్రేట్ రాయల్స్ ఆఫ్ రాచూరు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగదును విద్యార్థినికి ఇచ్చినట్లు గ్రామ ఉప సర్పంచ్, అసోసియేషన్ అధ్యక్షుడు చిల్కా రత్నబాబు తెలిపారు. చిల్కా కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గొడ్లచావిడి దగ్ధం

రేపల్లె: అగ్ని ప్రమాదంలో గొడ్ల చావిడి దగ్ధమై.. పశువులు గాయపడిన ఘటన మృత్యుంజయపాలెంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కేసన ఆంజనేయుల గొడ్ల చావిడి ప్రమాదవ శాత్తు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. రెండు గేదెలు, రెండు దూడలు తీవ్రంగా గాయపడ్డాయి. మండల పశువైద్యాధికారి ప్రవీణ్ వాటికి వైద్యసేవలు అందించారు. ఘటనా స్థలాన్ని సర్పంచ్ తిరుమలశెట్టి శివాజీ పరిశీలించి, బాధితులకు సాయం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

బాపూజీ బాపట్లకొచ్చి.. నేటికి 102ఏళ్లు

బాపట్ల అర్బన్: జాతిపిత మహాత్మ గాంధీ బోధనలు నిత్య నూతనాలని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. మహాత్మ గాంధీ బాపట్ల వచ్చి 102 ఏళ్లు అయిన సందర్భంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడారు.1921 ఏప్రిల్ 6న గాంధీ బాపట్ల వచ్చారని గుర్తుచేశారు. పట్టణంలో దేశరాజు బాపయ్య గారింట్లో బస చేశారని తెలిపారు. ఆయన నడయాడిన ప్రాంతానికే మహాత్మా గాంధీ రోడ్ గా నామకరణ చేశారన్నారు. అలాగే గాంధీజీ 1930 ఏప్రిల్ 6న ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.రత్న విజయ్ కుమార్, సిబ్బంది సీతా భవాని, మరియమ్మ, మణికంత, రవితేజ, జనవిజ్ఞాన వేదిక నాయకులు భాస్కరరావు, నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.



మహాత్మగాంధీ విగ్రహానికి నివాళి

కమనీయం.. శ్రీనివాసుని శాంతి కల్యాణం

జీఎన్‌పాలెం(పిట్టలవానిపాలెం): గోకరాజునల్లిబోయినవారి పాలెం శివారు శ్రీనివాసపురంలోని శ్రీలక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీనివాసుని శాంతి కల్యాణం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు బృందావనం గోపీచంద్ మాట్లాడుతూ.. ఏటా వార్షిక శాంతి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని దంపతులు శాంతి కల్యాణంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి తులసీ దళాలు, వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం జరిపించారు. నాలుగు వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయ నిర్మాణానికి భూ విరాళం అందించి, నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన గోకరాజు నరసరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. వైద్యుడు అంజిరాజు, పిట్టలవానిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గోకరాజు మూర్తి రాజు, ఆర్‌కే ఎడ్యుకేషన్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వేగేశన కిషోర్ కుమార్, గోకరాజు శ్రీధర్ వర్మ స్వామివారిని దర్శించుకున్నారు.



శ్రీనివాసుని శాంతి కల్యాణంలో దంపతులు

ఆలయ నిర్మాణానికి ఎంపీ మోపిదేవి విరాళం



నగరం: చిన్నమట్లపూడి గ్రామంలోని రెడ్డియంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి రూ.4,00,000లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు గురువారం అందజేశారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, నాయకులు ప్రసాదం వాసుదేవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇటీవల మృతి చెందిన చినమట్లపూడి మాజీ సర్పంచ్ షేక్ షిరాజుద్దీన్ కుటుంబ సభ్యులకు గృహ నిర్మాణం కోసం లక్ష రూపాయలు సాయంగా ఇచ్చారు. వారికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.